క్లుప్తంగా

'పొలంబాట'లో విద్యుత్ శాఖ అధికారులు


అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

భీమిని: విద్యుత్ శాఖ పొలంబాట కార్యక్రమంలో భాగంగా కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామ పంచాయతీలోని దాంపూర్‌లో విద్యుత్‌శాఖ అధికారులు వినియోగదారులకు అవగాహన కల్పించారు. విద్యుత్‌శాఖ ఏఈ రాజనర్సు, సబ్ ఇంజినీర్ రాహుల్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

నేడు భీమారం బంద్‌కు పిలుపు

భీమారం: బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం అనుసరించిన వైఖరికి నిరసనగా బీసీ సంఘాల నాయకులు శుక్రవారం భీమారం పట్టణం బంద్‌కు పిలుపునిచ్చారు. బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటూ బీసీల ఎదుగుదలను ఆపాలనే కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బంద్ పాటించి నిరసన తెలుపాలని కోరారు.

నామినేషన్ల తీరును పరిశీలించిన ఆర్డీవో


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల తీరును గురువారం ఆర్డీవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో కుమారస్వామి, తహసీల్దార్ సాయిబాబ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ మోడల్‌స్కూల్‌కు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి రామ్‌చరణ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామగిరి రమేశ్, పీడీ మహేందర్ తెలిపారు. ఇటీవల మంచిర్యాలలో జరిగిన ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

నూతన కార్యవర్గం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా రెడ్డి మహిళా వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా గడ్డం హేమలిని రెడ్డి, జిల్లా అధ్యక్షులుగా గోనె మణిమాల రెడ్డి, కార్యదర్శిగా పోటు సుధా రెడ్డి, ఈసీ మెంబర్లుగా కె.పద్మారెడ్డి, ఆర్.భాగ్యలక్ష్మి రెడ్డి, స్వాతి రెడ్డి, సీహెచ్ రేణుక రెడ్డి, టి.లీనారెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షురాలిగా బి.స్వరూపరాణి రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా కే.మణిమాల రెడ్డి, కార్యదర్శి పి.దివ్య రెడ్డి, ఉపకార్యదర్శి పి.శిరమారెడ్డి, కోశాధికారిగా బొమ్మ సరిత రెడ్డిలను ఎన్నుకున్నారు.

యూపీహెచ్‌సీలో పాము కలకలం

నస్పూర్: నస్పూర్‌లోని తీగల్‌పహడ్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో పాము కలకలం సృష్టించింది. గురువారం ఉదయం స్టాఫ్ నర్సు శారద, సిబ్బంది మల్లేశ్వరి విధుల్లో ఉండగా అకస్మాత్తుగా పాము వచ్చింది. దీంతో వారు పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించారు. అనంతరం హెల్త్ సెంటర్ సిబ్బంది నస్పూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్‌కు సమాచారం ఇచ్చారు. పామును పట్టే క్రమంలో మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్ ఎలాంటి భయం లేకుండా పాములు పట్టే వ్యక్తికి సహకరించారు. సిబ్బంది ఆయన ధైర్యాన్ని అభినందించారు. పాములు పట్టే వ్యక్తి మెడికల్ ఆఫీసర్ సహకారంతో పామును పట్టి, సంచిలో వేసుకుని తీసుకుని వెళ్లిపోయారు. దీంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. హెల్త్ సెంటర్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించాలని సిబ్బంది కోరారు.

పెట్రోల్ బంకులు తనిఖీ


సౌకర్యాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

జైపూర్: మండలంలోని జైపూర్, నర్వ, ఇందారం గ్రామాల్లోని పెట్రోల్ బంకులను గురువారం తహసీల్దార్ వనజారెడ్డి తనిఖీ చేశారు. బంకుల యాజమాన్యం కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఫ్రీ ఎయిర్, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, ఫైర్ ఫైటింగ్ పరికరాలను తనిఖీ చేశారు. ఆర్ఐ తిరుపతి, జీపీవో నవీన్‌రాజు, తదితరులు ఉన్నారు.

స్టాండ్‌లు సరే...ప్లాస్టిక్ డబ్బాలేవీ..?



బెల్లంపల్లి: చెత్త సేకరణలో బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు సరైన చిత్తశుద్ధి కనబర్చడం లేదు. ముఖ్యమైన ప్రాంతాల్లో రోడ్డు పక్కన చెత్త పారేయకుండా ప్రత్యేకంగా ఇనుప చువ్వలతో ప్లాస్టిక్ డబ్బాల ఏర్పాటు కోసం స్టాండ్‌లను నిర్మించిన అధికారులు, ఆ స్టాండ్‌లకు డబ్బాలు ఏర్పాటు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. రాంనగర్ కల్వర్టు ప్రక్కన, హన్మాన్ బస్తీ ఏరియాలో ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేయకపోవడంతో స్టాండ్‌లు బోసిపోయి కనిపిస్తున్నాయి. వెంటనే డబ్బాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు కోరుతున్నారు.

స్పందించారు.. గుంత పూడ్చారు



సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: లక్సెట్టిపేట–నిర్మల్ రహదారిపై దండేపల్లి మండల కేంద్రం సమీపంలో నర్సాపూర్ క్రాసింగ్ వద్ద రోడ్డుపై పెద్ద గుంతపడి ప్రమాదకరంగా మారింది. సమస్య పై 'ఆదమరిస్తే..అంతే' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితం అయ్యింది. స్పందించిన అధికారులు కాంక్రీటు వెట్‌మిక్స్‌తో గుంతను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ ఆఫీస్ ముందే పిచ్చి మొక్కలు



చెన్నూర్: పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాల్సిన మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కన్పిస్తోంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట నుంచి దసలి పట్టు కేంద్రం వరకు పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన, కార్యాలయాల ఎదుట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

సాగునీటి కాలువలు అధ్వానం

- పిచ్చిమొక్కలు పెరిగి, లైనింగ్ వాల్స్ కూలిపోయిన వైనం
- మరమ్మతు మరిచిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న రైతులు


చందారం 37 డిస్ట్రిబ్యూటరీ కాలువ తూము వద్ద చెత్తాచెదారం, కూలిన లైనింగ్ వాల్

లక్సెట్టిపేట: మండలంలోని సాగునీటి కాలువలపై ఇరిగేషన్ అధికారుల పట్టింపు కరువైంది. కడెం ఆయకట్టు కింద కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కాలువలు కావడంతో లైనింగ్ వాల్స్ కూలిపోయి, తూములు మరమ్మతు చేయకపోవడంతో పూర్తిగా చెడిపోయి, కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలానికి కడెం ఆయకట్టు కింద 37డిస్ట్రిబ్యూటరీ ద్వారా నీటిని సరఫరా చేస్తుండగా, ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి, పత్తి, ఇతర వాణిజ్య పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో వర్షం, కాలువ నీటితో పంటలు పండిస్తారు. రబీలో మోటార్ల సాయంతో సాగు చేస్తారు. కాలువల మరమ్మతు లేకపోవడంతో రైతులు తూముల వద్ద బండరాళ్లు అడ్డుపెట్టి నీటిని ఉప కాలువలకు తరలిస్తున్నారు. పై నుంచి వచ్చే చెత్తా చెదారం తూముల వద్ద నిలుస్తుండడంతో నిత్యం కాపలా కాయాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకొని కాలువలకు మరమ్మతు చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.

మరమ్మతులు లేవు...

ప్రస్తుతం కడెం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నుంచి 35, 37, 38, 38ఏ, 39, 40డిస్ట్రిబ్యూటరీ ద్వారా కాలువలతో ఆయకట్టు కిందికి నీటి సరఫరా జరుగుతోంది. ప్రధాన డిస్ట్రిబ్యూటరీ నుంచి సబ్ డిస్ట్రిబ్యూటర్లు మొత్తం పది ఉండగా, మండలం మొత్తంగా 13వేల ఎకరాలకు కాలువల ద్వారా నీరందుతోంది. కొన్ని ఉప కాలువల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇరిగేషన్ కార్యాలయంలో లస్కర్ సిబ్బంది కొరత ఉండడంతో కాలువల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కాలువల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సిబ్బంది ఫీల్డ్ వర్క్ పేరుతో కాలం గడుపుతున్నారని రైతుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. కొత్తూరు గ్రామ కాలువలో పిచ్చిమొక్కలు పెరిగాయి. చందారం కాలువ తూము వద్ద లైనింగ్ వాల్ కూలిపోయింది. ఇటిక్యాలకు వెళ్లే కాలువ పిచ్చి మొక్కలతో నిండి కనిపించడం లేదు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు పట్టించుకొని కాలువలకు మరమ్మతు చేసి నీటి సరఫరా సక్రమంగా సాగించాలని రైతులు కోరుతున్నారు.


37 డిస్ట్రిబ్యూటరీ ఉప కాలువలో పిచ్చిమొక్కలు

నివేదిక పంపించాం..

మండలంలోని కొన్ని కాలువల్లో మరమ్మతు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ఉపాధిహామీ పనుల్లో కాలువలోని చెత్తను తొలగించేందుకు వేసవి కాలంలో ఈజీఎస్ అధికారులకు తెలియజేశాం.. పనులు నిర్వహించలేదు. నిధులు మంజూరైతే మరమ్మతు జరిపించి రైతులకు న్యాయం చేస్తాం.

- దశరథ్, ఇరిగేషన్ డీఈ, లక్సెట్టిపేట

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం


శిథిలావస్థకు చేరిన వెటర్నరీ ఆసుపత్రి భవనం

- పై పెచ్చులు ఊడిపడడంతో రేకుల షెడ్డులోకి మార్పు
- మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు
- నూతన పక్కా భవనం నిర్మించాలని డిమాండ్

భీమారం: మండల కేంద్రంలో 65ఏళ్ల క్రితం నిర్మించిన పశు వైద్యశాల భవనం శిథిలావస్థకి చేరింది. పై పెచ్చులు రాలిపడుతున్నాయి. అధికారులు ఆసుపత్రిని ఒక దాత (చెర్కు సరోత్తం రెడ్డి) సొంత డబ్బులతో నిర్మించిన చిన్న రేకుల షెడ్డులోకి మార్చి నడుపుతున్నారు. తాత్కాలిక రేకుల షెడ్డులో పశువులకు చికిత్స అందించడానికి అవసరమైన వివిధ పరికరాలను అమర్చే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆసుపత్రి పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలోనే పురాతనమైనది. మండల కేంద్రంగా ఏర్పడక ముందే వెటర్నరీ ఆసుపత్రి ఇక్కడ ఉండేది. మండల వ్యాప్తంగా వేల సంఖ్యలో పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నందునా శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని కూల్చివేసి, కొత్త పక్కా భవనాన్ని నిర్మించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా, ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త భవనం నిర్మించి, మండలంలోని పశువులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సొంత భవనం నిర్మించాలి



మండలంలో పశువుల సంఖ్య అధికంగా పెరిగింది. వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లినప్పుడల్లా చాలా ఇబ్బందులు పడుతున్నాం. సరైన వసతులు లేవు. ప్రభుత్వం పశువైద్యశాల భవనానికి సొంత భవనం నిర్మించాలి.

- అమరగాని భీమయ్య, భీమారం

ప్రతిపాదనలు పంపించాం



కొత్త భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అయితే ఆసుపత్రి నిర్మించేందుకు సరిపోను భూమి కేటాయించాల్సిన అవసరం ఉంది. రైతులు కూడా ఈ విషయంలో సహకారం అందించాలి.

- రాకేశ్ శర్మ, మండల పశువైద్యాధికారి

ఎన్నికల హామీలు అమలు చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు



మాట్లాడుతున్న వెంకట్రాములు

దండేపల్లి: ఎన్నికల హామీలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. దండేపల్లిలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలన్నారు. పేదల భూములపై అటవీశాఖ అధికారుల పెత్తనం ఆపివేసి కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫారుసులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ, లంక రాఘవులు, సభ్యులు నూతన్ కుమార్, తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనిగరపు అశోక్, సీనియర్ నాయకులు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ ప్లకార్డులతో నిరసన

జన్నారం/మంచిర్యాలఅర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీవీయూవీ, జేవీఎస్ నాయకులు శ్రీనివాస్, వంశీలు పాల్గొన్నారు. జన్నారం మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులతో కలిసి అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటుమల్ల భరత్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ మాట్లాడారు. వెంటనే న్యాయవాదిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'స్థానిక' ఎన్నికల్లో పోటీకి సీపీఐ సిద్ధం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

పాతమంచిర్యాల: జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయడానికి సీపీఐ సిద్ధంగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం నాయకులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అన్ని మండల కేంద్రాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సీపీఐ పోటీలో ఉంటుందన్నారు. అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీలో ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్, మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు పోచన్న, చాడ మహేందర్ రెడ్డి, సత్యనారాయణ, దేవరాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

చెన్నూర్: పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్ భవన్ ముట్టడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు హైదరాబాద్ తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు రెవెల్లి మహేశ్, బుర్ర రాకేశ్‌గౌడ్, నాయబ్, రవీందర్, రేణిగుంట శ్రీనివాస్, తిరుపతి సురేశ్, గడిపల్లి సంతోశ్, రాజు, వర్మలు ఉన్నారు.

ఆర్‌కేపీలో 'ఓటుచోరీ సంతకాల సేకరణ'

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపుమేరకు పార్టీ నాయకులు పట్టణంలో గురువారం 'ఓటుచోరీ సంతకాల సేకరణ' కార్యక్రమాన్ని చేపట్టారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ ఓటు చోరీకి ఏవిధంగా పాలడ్డాయో ప్రజలకు వివరించారు. ఎలక్షన్ కమిషన్‌ను గుప్పిట్లో పెట్టుకుని బీజేపీ రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, గాండ్ల సమ్మయ్య, అజీజ్, జంగం కళ, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ తపాలా దినోత్సవం

భీమారం: మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌లో గురువారం అంతర్జాతీయ తపాలా దినోత్సవం నిర్వహించారు. పోస్ట్‌మాస్టర్ తన్నీరు రాజబాబుని సన్మానించారు. కార్యక్రమంలో అభయరామన్ సొసైటీ నిర్వాహకులు బూపల్లి లక్ష్మణ్, గ్రామ పెద్దలు పోటు మురళీధర్ రెడ్డి, విజయ్, సిబ్బంది హుస్సేన్, మహేష్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ వి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కంటి ఆరోగ్యం, ప్రాముఖ్యతను, అంధత్వం, దృష్టి లోపాలను నివారించాల్సిన ఆవశ్యకతపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, పిల్లల వైద్య నిపుణులు వేద వ్యాస్, డాక్టర్ శిల్ప, సీనియర్ ఆప్తమాలజిస్టు టెక్నికల్ పర్సన్ శంకర్, లయన్స్ రీజియన్ చైర్‌పర్సన్ కొత్త సురేందర్, జోన్ చైర్‌పర్సన్ వెంకటేశ్వర్లు, మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు కారుకూరి చంద్రమౌళి, డేగ బాపు, పి. వెంకటేశ్వర్లు, దామోదర్ పాల్గొన్నారు.

చేగువేర వర్ధంతి

లక్సెట్టిపేట: విప్లవ వీరుడు చేగువేరా వర్ధంతిని మండలంలోని యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాలీబాల్ పోటీల్లో కేకే–5 గ్రూపు గెలుపు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ...

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో డబ్ల్యూపీఎస్అండ్‌జీఏ ఆధ్వర్యంలో ఏరియా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలను డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తిక్ హాజరై ప్రారంభించారు. పోటీల్లో కాసిపేట–1, కాసిపేట–2, కేకే–5 గని జట్లు పాల్గొనగా కేకే–5 గ్రూపు జట్టు విజయం సాధించింది. కాసిపేట–2 గ్రూపు జట్టు రెండో స్థానం దక్కించుకుంది. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, యూనియన్ల ప్రతినిధులు, క్రీడాకారులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

సభ్యత్వ నమోదు


సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఏరియాలో ఎస్ఆర్పీ 3గనిలో గురువారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు చేపట్టారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి సభ్యత రుసుం తీసుకున్నారు. కార్మికులకు హక్కులు సాధించిన టీబీజీకేఎస్ ముున్ముందు కూడా కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పెట్టం లక్ష్మణ్, అన్వేష్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంగళకుమార్ స్వామి, బ్రాంచ్ నాయకులు సాధుల భాస్కర్, బుస్స రమేశ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయాలి


మాట్లాడుతున్న వెంకటయ్య

పాతమంచిర్యాల: సింగరేణిలో విధులు నిర్వహించి మృతి చెందిన కార్మికుడి భార్యకు పింఛన్ మంజూరు చేయాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఇందారం ఐకే–1 ఇంక్‌లైన్‌లో ట్రామర్‌గా పనిచేస్తున్న పుల్యాల ఓదెలు అనే కార్మికుడు అనారోగ్యంతో 2021లో గోల్డెన్ షేక్ హ్యాండ్ తీసుకొని, అనారోగ్యంతో 2024లో మృతి చెందాడు. కార్మికుడి భార్య పుల్యాల ఓదమ్మ తన భర్త తదనంతరం వచ్చే పింఛన్‌కోసం శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయంలో సింగరేణి అధికారులకు దరఖాస్తు పెట్టుకొని ఆరు మాసాలు గడుస్తున్నా ఆమెకు పింఛన్ మంజూరు చేయడం లేదన్నారు. సింగరేణి అధికారులు స్పందించి ఆమెకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం


ఇందారం ఐకే–1ఏ గనిపై సభ్యత్వాలు సేకరిస్తున్న శంకర్‌రావు

జైపూర్: సింగరేణి కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ కమిటీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గని, ఐకే–ఓసీపీపై గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్మికులతో కలిసి నాయకులు సభ్యత్వాలు సేకరించారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగే స్వామి, తిరుపతి, రాజు, ఏరియా నాయకులు రాంచందర్, శ్రీనివాస్, మల్లేశ్, సత్తయ్య, అశోక్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.